క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పాలాభిషేకం



మదనాపురం: మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం రెండో వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. గురుస్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొని పూజలు చేశారు. పూజలు నిర్వహించి దుర్గాదేవి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఒండ్రు మట్టిని సద్వినియోగం చేసుకోండి



పాన్‌గల్: ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలకు ఒండ్రుమట్టి తరలింపును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. శనివారం మండలంలోని రాయినిపల్లిలో చెరువులు, కుంటల నుంచి ఒండ్రు మట్టి తరలింపును పరిశీలించారు. ఒండ్రు మట్టితో పంట పొలాలకు జీవం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. రైతులకు ఉపయోగ పడే పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షకాలం సీజన్ వరకు పంచాయతీకి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురం చెందిన వట్టిపల్లి భూపాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి శనివారం గ్రామంలో కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



అమరచింత: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. మదనాపురం మండలం బావు సింగ్‌తండాకు చెందిన అభిరామ్ ఇంటి నుంచి శనివారం ఆత్మకూర్‌కు వచ్చాడు. అక్కడి నుంచి అమరచింతకు రాగా బస్టాండ్ సమీపంలో ఏడుస్తూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ సురేష్ కుమార్ బాలుడి ద్వారా కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకుని సమాచారం అందించారు. బాలుడి తల్లి సంధ్య పోలీస్‌స్టేషన్‌కు రాగా కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు.

కార్మిక హక్కులపై అవగాహన ఉండాలి

నాగర్‌కర్నూల్ క్రైం: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు తమ హక్కులపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి జి.సబిత అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీలోని ఎండబెట్లలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు తప్పనిసరిగా ఈ శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బాధిత కార్మికులకు ఉచితంగా న్యాయ సలహాలు, సేవలు అందించేందుకు జిల్లా, మండల స్థాయిలో న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తోందని అన్నారు. గతంలో నేరస్థుడికి తగిన శిక్ష పడాలని ప్రాధాన్యం ఇచ్చేవారని.. ఇప్పుడు నేరస్తులకు శిక్షతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును తనిఖీ చేశారు. జైల్లో ఉన్న 23 ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను జైలర్ నాగరాజుతో తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి శ్రీనిధి, న్యాయవాదులు పాల్గొన్నారు.



కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు



మూలమళ్లలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదాల బారిన ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఆత్మకూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయనే భయంతో ఆయా కాలనీవాసులు ఆందోళనకు చెందుతున్నారు. ఆత్మకూర్ పట్టణంలోనే పరిస్థితి చక్కబెట్టని అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్, ఖానాపూర్, గుంటిపల్లి, తిప్పుడంపల్లి, జూరాల, మోట్లంపల్లి, మేడేపల్లి, రేచింతల, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, మూలమళ్ల గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన 54 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు నేటికీ కంచెను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత లేకపోవడం వల్ల మూగజీవాలు విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. అయినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంచెలు ఏర్పాటు చేయాలి..



ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది వరకే పలుమార్లు ఈవిషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయింది. వర్షాకాలంలో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి.

– మోష, మూలమళ్ల

బడ్జెట్ రావడం లేదు..



ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేని కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయాన్ని ఉన్నతాధికారులకు గతంలోనే నివేదించాం. నిధులు రాకపోవడంతో గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా, మున్సిపాలిటీలో పాలకమండలి ద్వారా కంచెలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇదివరకు ఆత్మకూర్ పట్టణంలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేశారు. నిధులు విడుదల అయిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తాం.

– నర్సింహులు, ట్రాన్స్‌కో ఏఈ, ఆత్మకూర్



కత్తేపల్లిలో..



గుంటిపల్లిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన పశువు (ఫైల్)



పిన్నంచర్లలో..

వనపర్తి వాసులకు డాక్టరేట్



మల్లికార్జున్



సృజన

వనపర్తిటౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఏ.మల్లికార్జున్‌కు హైదరాబాద్ జేఎన్‌టీయూ ఈ నెల 21న డాక్టరేట్ అందజేసింది. మెగ్నీషియం నానోకాం పోసిట్ పాలిమార్ ఎలక్ట్రోలైట్స్ బ్యాటరీలు, సెన్సార్లల్లో ఉపయోగించవచ్చనే పరిశోధన జరిపినందుకు ఈ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు. ప్రొఫెసర్ జె.శివకుమార్ పర్యవేక్షణలో పరిశోధనలు జరిపారు. అదేవిధంగా పట్టణానికి చెందిన సృజనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇటీవలే డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురి ప్రొఫెసర్‌ల పర్యవేక్షణలో జరిపిన పరిశోధనలకు ఈ అవార్డును ప్రకటించినట్లు ఆమె తెలిపారు.

ఎంపీటీసీ స్థానం ఏర్పాటుకు వినతి



వినతిపత్రాన్ని అందిస్తున్న మూడు గ్రామాల ప్రజలు

అమరచింత: మండలంలోని కిష్టంపల్లి, చంద్రగడ్, నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాలను కలిపి కొత్తగా ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందించారు. గతంలో సింగంపేట, మస్తీపురం, కిష్టంపల్లి, చంద్రగడ్, నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాలను కలిపి ఎంపీటీసీ స్థానంగా కొనసాగేదని, ప్రస్తుతం జనాభ పెరిగిందని దీంతో సింగంపేట గ్రామం తమ గ్రామాలకు దూరంగా ఉందని వీటిని తొలగిస్తు తమ గ్రామాలను కలిపి కొత్తగా ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలు కొనసాగుతున్నాయని కొత్త స్థానం ఏర్పాటుతో ప్రజాపాలనకు అన్ని విధాలుగా బాగుంటుందన్నారు.

వీధి కుక్కలతో బెంబేలు



మటన్ మార్కెట్ రోడ్డులో వీధి కుక్కలు

అమరచింత: పట్టణంలోని పాత కల్లుగేరి, మటన్ మార్కెట్ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. పాత మార్కెట్ ప్రాంతంలోనే కురగాయలు, చేపలు, మాంసం దొరుకుతుండటంతో పట్టణంలోని ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కుక్కలతో పాటు పందుల మందసైతం ఇక్కడే ఉండటంతో ప్రజలు తినుబండరాలు, మాంసం, కూరగాయలు తీసుకెళ్తున్న సమయంలో వారిపై దాడిచేసి వాటిని లాక్కుతినే పరిస్థితులు దాపురించాయి. పందులను నివారించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించడంతో వీటిని పట్టణం నుంచి తరలించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కుక్కలు సైతం మనుషులపై దాడి చేస్తున్నాయి. పట్టణంలోని బస్టాండ్ రహదారితో పాటు అన్ని వార్డులలో కుక్కలు అధికంగా సంచరిస్తున్న మున్సిపల్ అధికారులు, పశువైద్యాధికారులు వాటిని నియంత్రించలేక పోతున్నారు.

అధికారుల్లో చలనం శూన్యం..

అన్ని మున్సిపాలిటీలలో వీధికుక్కలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నా.. స్థానిక మున్సిపాలిటీలో మాత్రం వాటిని అరికట్టేందుకు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. వనపర్తి, ఆత్మకూర్ మున్సిపాలిటీలలో కుక్కల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

నేలకూలిన వృక్షాలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద..

- కూలిపోయిన విద్యుత్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

ఆత్మకూర్: పట్టణంలో గాలివాన బీభత్సం సృష్టించింది ఒక్కసారిగా వీచిన గాలికి భారీ వృక్షాలు నేల కొరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో స్థానికులు విద్యుత్ అధికారులతీరుపై విస్తుపోయారు. మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఎంపీడీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, ఇతర కాలనీల్లో కూలిపాయిన చెట్లను మున్సిపల్ సిబ్బంది సహకారంతో తొలగించారు.



ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద కూలిన భారీ వృక్షం



ఈజీఎస్ కార్యాలయం వద్ద కూలిన చెట్లు



మండల పరిషత్ కార్యాలయం వద్ద కూలిన వృక్షం

ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి

అడ్డాకుల: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల ప్రకారం గ్రామీణ వైద్య సేవకులు ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలని.. పరిధిని మించి చికిత్సలు చేయవద్దని గ్రామీణ వైద్య సేవకుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ తెలిపారు. మూసాపేట మండల కేంద్రంలోని ఆదర్శ వద్ద శనివారం అడ్డాకుల, మూసాపేట మండలాల గ్రామీణ వైద్య సేవకుల సంఘం విజ్ఞన సదస్సును నిర్వహించారు. సదస్సులో శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ వైద్య సేవకులందరు ఐకమత్యంగా ఉండాలని, ఎవరో ఒకరు తప్పు చేయడం వల్ల అందరికీ సమస్యలు వస్తాయన్నారు. గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తున్నప్పటికీ గ్రామీణ వైద్య సేవకులపై జరుగుతున్న తనిఖీలపై, వైద్య సేవకులు చేయాల్సిన విధివిధానాల గురించి సమావేశంలో చర్చించారు. అనంతరం డాక్టర్ వాసు చైతన్య సీజనల్ వ్యాధులపై గ్రామీణ వైద్య సేవకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇమ్రాన్, హఫీజ్, కిన్నెర రాము, కుర్వ వెంకటేశ్వర్లు, అన్వర్, సుదర్శన్‌గౌడ్, సత్యనారాయణ, ఊరుకుందా పాల్గొన్నారు.

‘అమరరాజా కంపెనీ పనులు ఆపేయాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివిటిపల్లిలోని ఐటీ టవర్‌లో అమరరాజా బ్యాటరీ కంపెనీ (లిథియం అయాన్ గిగా) పనులను ఆపేయాలని స్థానిక నాలుగో వార్డు పరిధిలోని ఎదిర వాసులు కోరారు. ఈ మేరకు వారు శనివారం కేవీ రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో పరిసర ప్రాంతాలు కాలుష్యం బారిన పడతాయన్నారు. దీని ప్రభావం చుట్టుపక్కల గ్రామాలైన సిద్దాయపల్లి, అంబట్‌పల్లి, దివిటిపల్లిలపైనా పడుతుందన్నారు. గతంలో పీసీబీ అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే విషయాన్ని తెలియజేసినా ఫలితం దక్కలేదన్నారు. కార్యక్రమంలో శివశంకర్, ఎదిర వాసులు సుధా నర్సింహులు, ఎల్.రాములు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం’



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ఆంజనేయులు

ఆత్మకూర్: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌రాజు, కార్యదర్శి ఆంజనేయులు విమర్శించారు. శనివారం పట్టణంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పథకానికి బడ్జెట్లో నిధుల కేటాయింపును కుదిస్తు వస్తున్నారని, పథకాన్ని ఎత్తివేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజయ్, దేవన్న, నాయకులు, ఉపాధి కూలీలు ఉన్నారు.

రైల్వేగేట్ మూసివేతతో ఇబ్బందులు



రోడ్డును తవ్వి ఇనుప పట్టాలు అడ్డువేయడంతో మూతపడ్డ వెంకటగిరి రైల్వేగేట్



గుంతలమయంగా ప్రత్యామ్నయంగా వేసిన మట్టి రోడ్డు

దేవరకద్ర: కౌకుంట్ల మండలం కురుమూర్తి స్టేషన్ సమీపంలోని వెంకటగిరి రైల్వే గేట్‌ను అధికారులు మూసివేయించడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే కనీసం అండర్‌పాస్ పనులు కూడా ప్రారంభం కాకముందే రెండు నెలల క్రితమే గేట్‌ను మూసివేసి...రోడ్డును తవ్వి వదిలివేశారు. తాత్కాలికంగా గేటు నుంచి వెంకటగిరి గ్రామం మీదుగా మట్టి రోడ్డు వేసి అమ్మాపూర్ రోడ్డుకు కలిపారు. అయితే ఈ మట్టి రోడ్డు సరిగ్గా లేక పోవడం గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో.. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహన దారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కాగా ప్రసిద్ధి చెందిన కురుమూర్తి ఆలయంనకు, దేవరకద్ర నుంచి ఆత్మకూర్, కొత్తకోట పట్టణాలకు ఇదే దారి ఉంది. ఇలాంటి దారిని రెండు నెలల నుంచి మూసివేయడం కనీసం పనులు కూడ ప్రారంభించకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభం అయి అండర్ పాస్ పూర్తి అయ్యే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాపోతున్నారు. పనులు త్వరగా ప్రారంభించి అండర్‌పాస్ పూర్తి చేయాలని.. ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

నందివడ్డెమాన్ ఆధ్యాత్మిక ప్రాంతం



శనైశ్వరుడికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

- ఉజ్జయిని పీఠాధిపతి జగద్గురు సిద్ధలింగ రాజదేశి శివాచార్య భగవత్పాదులు

బిజినేపల్లి: నందివడ్డెమాన్ పూర్వం నుంచే ఆధ్యాత్మిక ప్రదేశమని.. ఈ ప్రాంతం నిత్యం పూజలు, హోమాలతో కళకళలాడుతూ ఉండేదని ఇక్కడి ఆలయాలు, వాటిలోని శిల్పకళ, చరిత్రను చూస్తే తెలుస్తుందని ఉజ్జయిని పీఠాధిపతి జగద్గురు సిద్ధలింగ రాజదేశి శివాచార్య భగవత్పాదులు అన్నారు. శనివారం ఆయన గ్రామంలోని జైష్టాదేవి సమేత శనైశ్వరస్వామిని దర్శించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో త్రికూట, కాళీమాత ఆలయాలు ఉండటం విశేషమన్నారు. చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలదేనని.. ఆలయాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్‌రావు, అర్చకులు శాంతికుమార్, ఉమ్మయ్య, మల్లికార్జున్, కమిటీ సభ్యులు వీరశేఖరాచారి, ప్రభాకర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు పత్తి విత్తనాలు

బిజినేపల్లి: మండలంలో పత్తి సాగు విస్తీర్ణం పెరగడంతో, కొందరు పత్తి విత్తన వ్యాపారులు రశీదుల్లో ఎంఆర్‌పీ ధరలను నమోదు చేసి నగదు రూపంలో ఒక్కో ప్యాకెట్‌పై రూ.100 నుంచి రూ.150 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ఏఓ నీతి గ్రామాల్లో పత్తి ప్యాకెట్లపై అవగాహన కల్పించేందుకు వెళ్లింది. కార్యక్రమానికి వచ్చిన రైతులు పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గౌతమి సీడ్స్, ఎస్ఎల్ఎన్ఎస్ ఫర్టిలైజర్స్, భాగ్యలక్ష్మి ట్రేడర్స్, సాయి ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. రసీదుల్లో రైతుల ఫోన్ నంబర్లు, గ్రామం వివరాలు నమోదు చేయకుండా పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారని, రసీదుల్లో మాత్రం ఎంఆర్‌పీ ధరలే ఉన్నాయని గుర్తించారు. కానీ నగదు రూపంలో సదానంద్, తడాకా పత్తి విత్తనాలు ఒక్కో ప్యాకెట్‌కు రూ.100 నుంచి రూ.150కి పైగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కోడేరు: మండలంలో డీలర్లు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని కొల్లాపూర్ సీఐ మహేష్, మండల వ్యవసాయ అధికారి శ్రీరాం హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంతో పాటు ముత్తిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు.

సెగ్రిగేషన్ షెడ్లపై నిర్లక్ష్యం



కేశంపేటలో సెగ్రిగేషన్ షెడ్డు పక్కన పొడిచెత్తకు నిప్పు (ఫైల్)

- ప్రతి పంచాయతీకి ఒక్కోటి నిర్మించిన ప్రభుత్వం
- ఇష్టారీతిన వాడుతున్న అధికారులు

గోపాల్‌పేట: గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరుగా వేసి తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయడం, పొడిచెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఒక సెగ్రిగేషన్ షెడ్డును ఏర్పాటు చేసింది. సేంద్రియ ఎరువులు అవసరమైన రైతులకు అందించడం, లేదంటే స్థానికంగా ఉండే నర్సరీలు, పల్లెప్రకృతి వనాలకు అవసరమైన చోట వాడుకునేందుకు నిబంధనలు ఉన్నాయి.



తాడిపర్తిలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్డు

ప్రస్తుతానికి ఉమ్మడి మండలంలోని సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నామని, పొడిచెత్తను అమ్ముతున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మాత్రమే అలా జరుగుతోంది. చాలా వరకు సెగ్రిగేషన్ షెడ్లలో చెత్త వేయకుండా ఆయా గ్రామాల్లోని శివార్లలో వేస్తున్నారు. లేదంటే సమీపంలోనే చెత్తను వేసి కాల్చుతున్నారు. చెత్త సేకరించి పంచాయతీలకు నిధులు సమకూర్చుకునే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువులు తయారు చేస్తున్నాం..



మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎరువులు తయారు చేయిస్తున్నాం. ఇప్పటికే ఉన్నతాధికారులు పర్యటించి పలు సూచనలు చేశారు. పాలికెపాడులో సేకరించిన పొడి చెత్త ద్వారా ఇప్పటికే సుమారు రూ.8వేలు పంచాయతీకి సమకూరాయి. అన్ని గ్రామాల్లోని ఎరువులు తయారు చేయించడం, అవసరమైనవి రైతులకు అమ్మేందుకు మేం సిద్ధంగా ఉన్నాం.

– ఉసేనప్ప, ఎంపీఓ, గోపాల్‌పేట

మండలంలో 27 పంచాయతీలు

ఉమ్మడి మండలంలో మొత్తం 27 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్ ఏర్పాటు చేశారు. కేశంపేట, రేవల్లి, గోపాల్‌పేట, చెన్నూరు కొన్ని గ్రామాల్లో పొడిచెత్తను కొన్నిసార్లు కాలుస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో అయితే సెగ్రిగేషన్ షెడ్లలో కుక్కలు నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. అధికారులు చొరవ తీసుకుని ప్రతి సెగ్రిగేషన్ షెడ్‌లో సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.